ప్రజాపక్షం
PRAJAPAKSHAM
స్తంభాద్రి భద్రాద్రి
మంగళవారం | 23 | ఏప్రిల్ | 2024 పేజీలు 6

## ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలి



2 లో

-మోడల్ టెస్టులతో మానసిక ధైర్యం పెంపొందుతుంది
-ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం, పోటు
-ఏఐఎస్ఎఫ్ మోడల్ ఎంసెట్, నీట్ విజయవంతం

# సంధి కుదిరిందా..
# అభ్యర్థి ఎవరు..?



-ఎవరి వాదన వారిదే
-బెంగళూరుకు భట్టి, పొంగులేటి
-తుమ్మలతో ఖర్గే ఫోన్‌లో సంప్రదింపులు





**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు అభ్యర్థిత్వం ఖరారుపై ఇంకా ప్రతిష్టాంభన కొనసాగుతూనే ఉంది. పూటకొక పేరు ప్రచారంలోకి వస్తున్న ప్రస్తుత తరుణంలో సోమవారం జిల్లాకు చెందిన ఇద్దరు మంత్రులు బెంగళూరులో పార్టీ నాయకులతో చర్చించారు. వీరి మధ్య రాజకీయ సంది కుదిరిందా లేదా అన్నది ఇతిమిద్ధంగా తేలలేదు. కాంగ్రెస్ అభ్యర్థిగా స్థానికేతరుడు అయినా రామసహాయం రఘురామిరెడ్డికి దక్కే అవకాశం ఉందని కొందరు కాదు మల్లు నందినికే దక్కనుందని మరి కొందరు మంత్రుల బంధువులు, కుటుంబ సభ్యులకు అవకాశం లేదని రాయల నాగేశ్వరరావుకు అవకాశం ఉందని మరి కొందరు ప్రచారం చేస్తున్నారు. నామినేషన్ల దాఖలుకు మరో రెండు రోజులు మాత్రమే మిగిలి ఉన్న దశలో కాంగ్రెస్ అభ్యర్థి ఖరారు కాకపోవడం చర్చకు దారి తీస్తుంది. ఖమ్మం పార్లమెంటు కాంగ్రెస్ అభ్యర్థి ఎంపిక అధిష్టానానికి తలనొప్పిగా మారింది. ఈ అభ్యర్థి విషయమై ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, రెవెన్యూ మంత్రి పొంగులేటి శ్రీనివాస రెడ్డి ల మధ్య ప్రతిష్టాత్మకంగా మారింది. ఇరువురు తమ సానుకూల అభ్యర్థిత్వం కోసం పట్టుబడుతున్నారు. దీనితో అధిష్టానం ఏటు తేల్చుకోలేని పరిస్థితిలో ఉంది. మరో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు కాంగ్రెస్ అధిష్టాన నిర్ణయానికి వదిలి వేయడంతో పాటు వేచి చూసే ధోరణి అవలంభిస్తున్నారు. ఈ దశలో కాంగ్రెస్ జాతీయ అధ్యక్షులు మల్లికార్జున్ ఖర్గే మంత్రి తుమ్మల నాగేశ్వరరావుకు ఫోన్ చేసి అభ్యర్థి ఎంపిక విషయమై చర్చించినట్లు సమాచారం. సోమవారం మల్లికార్జున్ ఖర్గే తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ రాజకీయాలను పరిశీలిస్తున్న కర్నాటక ఉప ముఖ్యమంత్రి డికె శివకుమార్‌ను మల్లు భట్టివిక్రమార్క, పొంగులేటి శ్రీనివాసరెడ్డిని బెంగళూరుకు పిలిపించారు. వారి అభిప్రాయాలను తెలుసుకున్నారు. ఇద్దరు కూడా పట్టుదలతోనే ఉన్నారని సమాచారం. ఈ దశలో పొంగులేటి వియ్యంకుడు రఘురాంరెడ్డి వైపు అధిష్టానం మొగ్గు చూపిందని ప్రచారం జరుగుతుంది. ఈ నెల 25తో నామినేషన్ల గడువు ముగుస్తున్న తరుణంలో అధికార పార్టీ అభ్యర్థిని ప్రకటించక పోవడం, మంత్రుల పట్టుదల కాంగ్రెస్ క్యాడర్‌ను గందరగోళానికి గురి చేస్తుంది.

### ఖమ్మం పార్లమెంటుకు
## ఏడు నామినేషన్లు





స్వతంత్రులే ఎక్కువ

**ప్రజాపక్షం/ ఖమ్మం :** ఖమ్మం పార్లమెంటు స్థానానికి సోమవారం ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. వీరిలో స్వతంత్ర అభ్యర్థులే ఎక్కువగా ఉండడం గమనార్హం. రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్‌కు నామినేషన్ పత్రాలను అందించిన వారిలో స్వతంత్ర అభ్యర్థి దండా లింగయ్య, తేజావత్ జోగురాము, ఎదురుగట్ల చిట్టిమల్లు, మద్దిశెట్టి యర్రప్ప, మద్దినేని అనిల్‌కుమార్ ఉన్నారు. ఉల్లెంగుల యాదయ్య కాంగ్రెస్ అభ్యర్థిగా ఒక సెట్ నామినేషన్ దాఖలు చేసి స్వతంత్ర అభ్యర్థిగా మరో నామినేషన్ సెట్‌ను రిటర్నింగ్ అధికారి విపి గౌతమ్‌కు అందజేశారు. బహుజన లెఫ్ట్ ఫ్రంట్ పార్టీ అభ్యర్థిగా అంతోని సురేష్ నామినేషన్ దాఖలు చేశారు. అభ్యర్థుల వివరాలను అధికారులు వెల్లడించారు. నామినేషన్లకు మరో మూడు రోజులు సమయం ఉంది. ఈనెల 25న మధ్యాహ్నం మూడు గంటల వరకు నామినేషన్లను దాఖలు చేయవచ్చునని అధికారులు తెలియజేశారు. ఈనెల 24న బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు నామినేషన్ దాఖలు చేయనుండగా కాంగ్రెస్ అభ్యర్థి ఇంత వరకు ఖరారు కాలేదు. బిజెపి అభ్యర్థి ఇప్పటికే నామినేషన్ దాఖలు చేశారు.

### మావోయిస్టు ప్రభావిత
## ప్రాంతాల్లో డిజిపి పర్యటన



- చర్ల సరిహద్దు బేస్ క్యాంపుల సందర్శన
- అప్రమత్తంగా ఉండాలంటూ సూచన

**ప్రజాపక్షం/భద్రాచలం :** మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డిజిపి రవిగుప్తా సోమవారం పర్యటించారు. ఈ సందర్భంగా చర్ల మండల పరిధిలోని చెన్నాపురం, పూసుగుప్ప,ఉంజుపల్లి పోలీస్ క్యాంపులను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ప్రత్యేక హెలీకాప్టర్‌లో చేరుకున్నారు. ఇందులో భాగంగా ఆయన బేస్ క్యాంపుల వద్ద మాట్లాడుతూ మావోయిస్టుల కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారాన్ని సేకరిస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అభివృద్ధి నిరోదకులుగా మారిన మావోయిస్టుల వల్ల రాబోయే పార్లమెంట్ ఎన్నికల్లో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ పర్యటనలో ఆయన వెంట ఇంటిలెజెన్సీ అడిషనల్ డీజిపి శశిధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డిజి విజయ్ కుమార్, సిఆర్‌పిఎఫ్ సౌత్‌జోన్ అడిషనల్ డిజిపి రవిదీప్ సింగ్ సాహూ, సిఆర్‌పిఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజిపి చారునిన్హా, ఎస్ఐపి ఐజిపి సుమతి తదితరులు పాల్గొన్నారు.

# యుద్ధ ప్రాతిపదికన వర్ష నష్ట నివారణ చర్యలు చేపట్టాలి

**కలెక్టర్, విద్యుత్‌శాఖ అధికారులతో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే కూనంనేని**



**ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లిః** జిల్లావ్యాప్తంగా సోమవారం కురిసిన వడగండ్ల వాన, భారీ ఈదురుగాలులతో తీవ్రంగా నష్టం వాటిల్లిందని, తక్షణమే అధికార యంత్రాంగాన్ని అప్రమత్తంగా చేసి యుద్ధప్రాతిపదికన నష్ట నివారణ చర్యలు చేపట్టాలని కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు కోరారు. ఈ మేరకు మంగళవారం జిల్లా కలెక్టర్‌కు, విద్యుత్‌శాఖ జిల్లా అధికారులకు ఫోన్ చేసి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ భారీగా కురిసిన వడగండ్ల వాన, ఈదురుగాలులతో పేదల ఇళ్ళు, గుడిసెలు నేలమంట్టం అయ్యాయని, విద్యుత్ స్థంభాలు నేలకొరిగి అనేక గ్రామాలు, పట్టణాల్లోని బస్తీలు అంధకారంలోకి నెట్టివేయబడ్డాయని, తక్షణమే విద్యుత్ పునఃరుద్ధరణ పనులు చేపట్టాలని కోరారు. ఇళ్ళు కోల్పోయిన పేదలకు తక్షణమే పరిహారం అందజేసే విధంగా చర్యలు తీసుకోవాలని, పూర్తిగా ఇళ్ళు కోల్పోయిన వారికి ప్రభుత్వ గృహ పథకం మంజూరు చేయించాలని కోరారు. మామిడి, మిర్చి ఇతర పంటలు పూర్తిగా దెబ్బతిని రైతులు తీవ్రంగా నష్టపోయారని సంబంధిత వ్యవసాయశాఖ అధికారులతో సర్వే ఏపట్టి నష్టాన్ని అంచనా వేయడం ద్వారా ప్రభుత్వం నుంచి పరిహారం అందేలా చర్య తీసుకోవాలని జిల్లా ఉన్నతాధికారులను కూనంనేని కోరారు.

# ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలి



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పోటీ ప్రపంచంలో విద్యార్థులు ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలని, మోడల్ టెస్టుల ద్వారానే మానసిక ధైర్యం పెంపొందుతుందని ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ నేతలు బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు తెలిపారు. ఏఐఎస్ఎఫ్ ఖమ్మం జిల్లా సమితి ఆధ్వర్యంలో సోమవారం జిల్లా వ్యాప్తంగా మోడల్ ఎంసెట్, నిట్ పరీక్షలను నిర్వహించారు. ఈ సందర్భంగా ఖమ్మం నగరంలోని డాక్టర్స్ అకాడమీలో మోడల్ నిట్, ఇంజనీరింగ్ ప్రశ్నా పత్రాలను బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు ఆవిష్కరించారు. ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షులు మదుపల్లి లక్ష్మణ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో బాగం హేమంతరావు, పోటు ప్రసాద్ లు మాట్లాడుతూ విద్యార్థులు అన్ని రంగాలలో రాణించాలన్నారు. మోడల్ పరీక్షలు రాయడం వల్ల విద్యార్థులకు పరీక్షల పట్ల అవగాహన కలుగుతుందని అదేవిధంగా మానసిక స్థైర్యం పెంపొందుతుందన్నారు. ప్రభుత్వం నిర్వహించే ఎంసెట్, నిట్ పరీక్షల్లో విద్యార్థులు ఎటువంటి భయాందోళనకు గురి కాకుండా ఉండడానికి 25 ఏళ్లుగా ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో మోడల్ ఎంసెట్ నిర్వహిస్తున్నట్లు వారు తెలిపారు. నిట్ విద్యార్థులకు మోడల్ నిట్ ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ప్రభుత్వం నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తలతో పాటు విద్యార్థులు సమయం వృధా కాకుండా పరీక్ష ఎలా రాయాలో అనేది తెలుసుకునేందుకు వీలుంటుందన్నారు. ఏఐఎస్ఎఫ్ మాజీ జాతీయ ఉపాధ్యక్షులు రావి శివరామకృష్ణ, డాక్టర్స్ అకాడమీ డైరెక్టర్ సతీష్ కుమార్ మాట్లాడుతూ విద్యార్థులు విజయమే లక్ష్యంగా ప్రణాళికాబద్ధంగా ఒత్తిడిని తట్టుకుని విజయాలు సాధించాలన్నారు. సమాజంలో పోటీ పెరుగుతుందని దానికి తగినట్లుగా కష్టపడి చదివితే ఉన్నత శిఖరాలను అధిరోహించ వచ్చునని తెలిపారు. ఓడిపోయామని కుంగిపోవద్దని ఇప్పటి ఓటమే రేపటి విజయానికి నాంది పలుకుతుందని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్ఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఇటికాల రామకృష్ణ, నాయకులు శివ, వంశీ, బాలాజీ, ప్రతాప్, రాకేష్, రోహిత్, రాహుల్, స్వరూప, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# చికిత్సపొందుతూ పంచాయతీ కార్మికుడు మృతి



**ప్రజాపక్షం/కొణిజర్ల :** పంచాయతీ కార్యదర్శి తనను పనిలోకి రానివ్వకుండా వేధింపులకు గురిచేస్తున్నాడని ఆరోపిస్తు గత నెల 28 న పురుగులమందు తాగి ఆత్మహత్యకు పాల్పడ్డ పంచాయతీ కార్మికుడు చికిత్సపొందుతు సోమవారం మృతిచెందాడు. కొణిజర్ల ఎస్సై జె శంకర్‌రావు తెలిపిన వివరాలు ప్రకారం మండలంలోని అంజనాపురం గ్రామానికి చెందిన పంచాయతీ కార్మికుడు భూక్యా ప్రసాద్ ను పంచాయతీ కార్యదర్శి కొన్ని రోజులుగా పనిలోకి రానివ్వకుండా చెత్త ట్రాక్టర్ ను తోలడానికి అనుమతి ఇవ్వకపోవడంతో పాటు పనిలోకి వస్తే కేసు పెడతానని బెదిరించడంతో మనస్థాపం చెంది గత నెల 28 న పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. ఖమ్మంలోని ఓ ప్రయివేటు ఆసుపత్రిలో చికిత్సపొందుతు సోమవారం మృతిచెందాడు. ప్రసాద్ మృతికి కారణమైన పంచాయతీ కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తు బంధువులు ఖమ్మం ప్రభుత్వాసుపత్రి వద్ద పోస్టుమార్టం చేయకుండా అడ్డుకున్నారు. దీంతో వైరా సిఐ సాగర్ నాయక్ ఎస్సై శంకర్‌రావులు సంఘటనాస్థలానికి చేరుకుని ఆందోళనకారులతో మాట్లాడి మృతుడు ప్రసాద్ కుటుంబానికి న్యాయం చేస్తామని హామినివ్వడంతో పోస్టుమార్టానికి ఒప్పుకున్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని స్వగ్రామం అయిన అంజనాపురానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు. మృతుడు భార్య నాగమణి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్సై శంకర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నాడు.

# అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మతులు పూర్తి చేయాలి : కలెక్టర్



**ప్రజాపక్షం/భద్రాద్రి కొత్తగూడెం :** వేసవి సెలవులు పూర్తయ్యే నాటికి అమ్మ ఆదర్శ పాఠశాలల మరమ్మత్తులు పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ డా.ప్రియాంక ఆలా అన్నారు. ఈ మేరకు సోమవారం ఆమె సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జిల్లాలో 643 పాఠశాలకు మంజూరైన పనులన్నింటిని నేటి నుండి ప్రారంభించాలన్నారు. పనుల్లో అలసత్వం, నాణ్యతా లోపం ఉన్నా క్షమించేదే లేదన్నారు. ఈ కార్యక్రమంలో పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

# రామాలయాన్ని దర్శించుకున్న పోలీస్ బాస్‌లు



**ప్రజాపక్షం/భద్రాచలం :** భద్రాచలం శ్రీ సీతా రామ చంద్ర స్వామివారిని డిజి పి రవిగుప్తాతో పాటు పలువురు రాష్ట్ర స్థాయి పోలీస్ అధికారులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా వారికి ఆలయం తరుపున ఘన స్వాగతం పలికారు. గర్భగుడిలోని స్వామికి పూజలు చేసిన అనంతరం తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ విశిష్ట గూర్చి అర్చకులు వివరించారు. రామాలయంతరుపున వారికి షాలువాలు కప్పి మెమోటలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఇంటిలెజెన్సీ అడిషనల్ డీజిపి శశిధర్‌రెడ్డి, గ్రేహౌండ్స్ అడిషనల్ డిజి విజయ్ కుమార్, సిఆర్‌పిఎఫ్ సౌత్‌జోన్ అడిషనల్ డిజిపి రవిదీప్ సింగ్ సాహూ, సిఆర్‌పిఎఫ్ సౌత్ సెక్టార్ హైదరాబాద్ జోన్ ఐజిపి చారునిన్హా, ఎస్ఐపి ఐజిపి సుమతి, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఎస్పి రోహిత్ రాజ్, ములుగు ఎస్పి శబరీ,వ, భూపాలపల్లి ఎస్పి కిరణ్ ప్రభాకర్ కరే, ఎస్ఐపి ఎస్పి రాజేష్, కొత్తగూడెం ఓఎస్‌డి సాయిమనోహర్, భద్రాచలం ఏఎస్పి పారితోష్ పంకజ్, ఏటూరునాగారం ఏఎస్‌పి మహేష్ జితే, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్ తదితరులున్నారు.

# సాయి అలేఖ్యను అభినందించిన కలెక్టర్ గౌతమ్






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** అత్యంత ప్రతిష్టాత్మకంగా భావించే సివిల్ సర్వీసెస్ పరీక్ష 2023 లో 938వ ర్యాంకు సాధించిన ఖమ్మం జిల్లాకు చెందిన రావూరి సాయి అలేఖ్యను జిల్లా కలెక్టర్ విపి గౌతమ్ అభినందించారు. సోమవారం నూతన కలెక్టరేట్‌లోని కలెక్టర్ చాంబర్‌లో జిల్లా కలెక్టర్ విపి గౌతమ్‌ను సాయి అలేఖ్య తన తల్లిదండ్రులతో కలిసి మర్యాద పూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా కలెక్టర్ సాయి అలేఖ్యను అభినందించి సన్మానించారు. అలేఖ్య తండ్రి బోనకల్ మండలం గోవిందాపురం (ఎల్) వాస్తవ్యులు కాగా పోలీస్ శాఖలో హెడ్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్నాడు. స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, శిక్షణ సహాయ కలెక్టర్ మిర్నల్ శ్రేష్ట లు అభినందించారు.

**పోలీస్ కమిషనర్ అభినందనలు...**

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (యుపిఎస్‌సి) పరీక్షల్లో 938వ ర్యాంకు సాధించిన రావూరి సాయి అలేఖ్యను పోలీస్ కమిషనర్ సునీల్ దత్ సన్మానించారు. సోమవారం సాయి అలేఖ్యతో పాటు తల్లిదండ్రులు రావూరి ప్రకాషరావు, పద్మశ్రీ లు పోలీస్ కమిషనర్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సాయి అలేఖ్యను సిపి అభినందించి సన్మానించి మిఠాయిలు తినిపించారు. ఈ కార్యక్రమంలో ఏఎస్‌పి అవినాష్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# నూతన వధువరులను ఆశీర్వదించిన మాజీ ఎమ్మెల్యే కందాళ



**ప్రజాపక్షం/కూసుమంచి :** మండలంలోని కొత్తూరు గ్రామానికి చెందిన రాగి నారాయణ చారి ఉప్పమ్మల కుమారుడు వీరభద్ర చారి లావణ్యల వివాహ రిసేప్షన్ కు సోమవారం పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి పాల్గొని నూతన వధూవరులను ఆశీర్వదించారు. అంతకంటే ముందు పార్లమెంటు ఎలక్షన్స్ నేపథ్యంలో భాగంగా ఖమ్మం రూరల్ మండలంలో ముఖ్య కార్యకర్తల సమావేశంలో కందాళ పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్ష కార్యదర్శులు వేముల వీరయ్య, మహమ్మద్ ఆసిఫ్ పాషా, మాజీ డిసిసిబి డైరెక్టర్ ఇంటూరి శేఖర్, ఎంపీటీసీ బజ్జూరి రామ్ రెడ్డి, మాజీ సర్పంచ్ లు కాసాని సైదులు, కొండ సత్యం, రైతు సమన్వయ కన్వీనర్ రామ్ కుమార్, గ్రామ శాఖ అధ్యక్షులు లోడిగా సైదులు,బానోత్ శీను స్థానిక నాయకులు పాల్గొన్నారు.

# ప్రవేశం పొందిన వారికి రికార్డుషీట్ తప్పనిసరిగా ఇవ్వండి




**ప్రజాపక్షం/కల్లూరుః** గురుకులంలోఐదులో ఐదో తరగతిలో ప్రవేశం పొందిన వారికి ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలు ప్రధానోపాధ్యాయులు తప్పనిసరిగా రికార్డ్ షీట్ ఇవ్వాలని మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్ తెలిపారు. ప్రవేశం పొందిన వారు జూన్ ఆరో తేదీ లోపల రికార్డ్షిట్ గురుకులంలో అప్పగించి సీటును పొందాలని లేనిచో ప్రవేశం రద్దు అవుతుందని గురుకుల కళాశాల ప్రిన్సిపాల్, శ్రీలత తెలిపారు. పేద విద్యార్థిని విద్యార్థులు సీటును కోల్పోకుండా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు సహకరించి వారికి వెంటనే రికార్డ్ టి సి స్టడీ సర్టిఫికెట్లను అందించాలని కోరారు ఈ మేరకు ప్రభుత్వ ప్రైవేటు పాఠశాలలకు ఆదేశాలు ఇచ్చినట్లు కల్లూరు మండల విద్యాశాఖ అధికారి తెలిపారు. కల్లూరు లోని సీఆర్పీలు ద్వారా ప్రభుత్వ ప్రైవేటు ప్రధానోపాధ్యాయులకు ఆదేశాలిచ్చినట్లు పేర్కొన్నారు. విద్యార్థులను తల్లిదండ్రులను టి సి విషయంలో ఇబ్బంది పెట్టవద్దని ఆయన వివరించారు.

# రేపటి నుండి పాఠశాలలకు వేసవి సెలవులు

**ప్రజాపక్షం/కల్లూరుః** ఒకటో తరగతి నుంచి 9వ తరగతి వరకు వార్షిక పరీక్షలు ముగిశాయి. మంగళవారం 23వ తేదీ విద్యార్థుల తల్లిదండ్రుల తో సమీక్ష సమావేశం నిర్వహించి విద్యార్థుల ప్రగతి పత్రాలను అందజేస్తారని మండల విద్యాశాఖ అధికారి దామోదర్ ప్రసాద్ తెలిపారు. ఏప్రిల్24 నుంచి జూన్ 11 వరకు 49 రోజులపాటు విద్యార్థులకు సెలవులు ఉండనున్నా యి. జూన్ 12న పాఠశాలలో పున ప్రారంభిస్తున్నట్లు ఎం ఈ ఓ తెలిపారు. కావున వేసవి సెలవులలో ఎలాంటి శిక్షణా తరగతులు నిర్వహించబడవని ఆయన పేర్కొన్నారు వేసవి సెలవులలో శిక్షణ తరగతులు నిర్వహిస్తే చర్యలు తీసుకుంటామని ఎంఈఓ హెచ్చరించారు. వేసవి సెలవులలో విద్యార్థుల నడవడిక ను గమనిస్తూ ఉండాలని చెరువులు కుంటలు బావులు నీటి నిల్వ లువద్దకు ఈతకు వెళ్ళవద్దని తల్లిదండ్రులు గమనిస్తూ ఉండాలని ఆయన వివరించారు. వేసవి సెలవుల్లో మెలగాల్సిన క్రమశిక్షణ పద్ధతులను ఉపాధ్యాయులు విద్యార్థులకు వివరించారు.

# రైతన్నలకు అండగా నిలిచింది కేసిఆరే..

**-పంటలకు మద్దతు ధర తీసుకు వస్తాం**
**-ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసింది**
**-ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ అభ్యర్థి నామ**





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల వైఖరి వల్ల తెలంగాణ రైతాంగం తీవ్రంగా నష్టపోతుందని ఖమ్మం పార్లమెంటు బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు తెలిపారు. రైతన్నలకు అండగా నిలిచింది బిఆర్ఎస్ ప్రభుత్వం కేసిఆరేనని ఆయన తెలిపారు. సోమవారం ఖమ్మం నగరంలోని ఖమ్మం వ్యవసాయ మార్కెట్ యార్డును బిఆర్ఎస్ అభ్యర్థి నామ నాగేశ్వరరావు సందర్శించారు. అక్కడ ఉన్న రైతులు, హమాలీలతో మాట్లాడి వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రాబోయే పార్లమెంటు ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటేసి బిఆర్ఎస్‌ను గెలిపించాలని కోరారు.ఈ సందర్భంగా నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకు వచ్చిన కరువుతో సాగు, తాగునీరు లేక రైతులు, ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాష్ట్రంలో సాగు నీరు అందక పోవడంతో వరి పంట ఎండిపోయి రైతాంగం దిక్కుతోచని స్థితి ఎదురైందన్నారు. వెంటనే ప్రభుత్వం రైతులకు నష్టపరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. పార్లమెంటులో మినిమం సపోర్ట్ ప్రైజ్ (ఎంఎస్‌పి) అమలు చేయాలని దానికి ప్రత్యేక చట్టం అమలు చేయాలని కేంద్రాని కోరిన స్పందించ లేదన్నారు. స్వామినాథన్ ఇచ్చిన సూచనలు కూడా అమలు చేయాలని కోరిన ఎటువంటి స్పందన లేదన్నారు. కాంగ్రెస్ ఓట్ల కోసమే వాగ్దానాలు చేస్తుందని నామ ఆరోపించారు. ఆరు గ్యారెంటీల పేరుతో ప్రజలను కాంగ్రెస్ పార్టీ మోసం చేసిందని ప్రజలు ఈ విషయాన్ని తెలుసుకోవాలన్నారు. తెలంగాణ ప్రయోజనాల కోసం పార్లమెంటులో గొంతెత్తి మాట్లాడేది ఒక్క బిఆర్ఎస్ ఎంపిలేనని తెలిపారు. రైతులు పండించిన ప్రతి పంటకు మద్దతు ధర కల్పించేలా కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటీ మాజీ ఛైర్మన్ దోరేపల్లి శ్వేత, చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు చిన్ని కృష్ణారావు, మాటేటి నాగేశ్వరరావు, సతీష్, నరేష్, మెంతుల శ్రీశైలం, నవీన్, గునుగుంట్ల వాసు, తాళ్లూరి శ్రీనివాస్, చీకటి రాంబాబు, కృష్ణప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీతనంతో వ్యవహరించాలి

**-చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలి**
**-అదనపు కలెక్టర్ సత్యప్రసాద్**






**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారులు జవాబుదారితనంతో వ్యవహరించాలని, నూతన పంచాయితీ రాజ్ చట్టాలపై పూర్తి అవగాహన కలిగి ఉండాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారులతో పారిశుద్ధ్యం, తాగునీరు సరఫరా, మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాలు, వడగాలులు తదితర అంశాలపై ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ సమస్యల పరిష్కారానికి ప్రత్యేకాధికారులు ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. పారిశుద్ధ్యంపై చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉండేటట్లు చర్యలు తీసుకోవాలన్నారు. వేసవిలో తాగునీటి సరఫరాకు అత్యంత ప్రాముఖ్యత నివ్వాలని, ఎక్కడ తాగునీటి ఇబ్బందులు కలుగకుండా చర్యలు చేపట్టాలన్నారు. మిషన్ భగీరథ నీటి సరఫరా లేని ప్రాంతాల్లో ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేయాలన్నారు. తాగునీటి వనరులు గుర్తించి అందుబాటులో ఉంచాలన్నారు. బోర్లు ఫ్లషింగ్ చేయాలని, అవసరమగు మరమ్మతులు చేయాలని, పంపు సెట్లు అన్ని పనిచేయునట్లు చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైతే ప్రైవేటు నీటి వనరులను లీజుకు తీసుకోవాలన్నారు. ట్యాంకర్ల ద్వారా తాగునీటి సరఫరా చేయాల్సి ఉన్నచోట గ్రామ పంచాయితీల ట్యాంకర్లను వినియోగించాలన్నారు. నర్సరీలు, విద్యుద్దీపాలు, మురుగు కాలువలు, అంతర్గత రహదారుల నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఇంటి పన్నులు, లే అవుట్ అనుమతులు, నాలా ట్యాక్స్ సక్రమంగా వసూలు చేయాలన్నారు. మల్టీ పర్పస్ వర్కర్ల వేతనాల విడుదలపై వెంటనే చర్యలు తీసుకోవాలన్నారు. వడదెబ్బ పై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. ఉపాధి హామీ పనులు జరిగే చోట కూలీలకు అన్ని జాగ్రత్తలు చేపట్టాలన్నారు. నీడ, తాగునీరు, ఓఆర్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచాలన్నారు. ప్రత్యేకాధికారులు గ్రామ ప్రజలకు అందుబాటులో ఉండాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో జెడ్పి సిఈవో వినోద్, డిఆర్‌డివో సన్యాసయ్య, గ్రామ పంచాయితీ ప్రత్యేకాధికారులు తదితరులు పాల్గొన్నారు.

# ఉచిత స్పోకెన్ ఇంగ్లీష్‌ను సద్వినియోగం చేసుకోండి




**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** వేసవి లో విద్యార్థుల కోసం ఏర్పాటు చేసిన ఉచిత స్పోకెన్ ఇంగ్లీషు క్యాంపు ను సద్వినియోగం చేసుకోవాలని శత తారక వ్యవస్థాపక అధ్యక్షుడు ఆర్.వీ.కృష్ణ యాదవ్ కోరారు. మండల కేంద్రంలోని ఎవర్‌గ్రీన్ స్కూల్ లో ఏర్పాటు చేసిన స్పోకెన్ ఇంగ్లీషు కార్యక్రమం ను సోమవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు....శత తారక ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో విద్య, వైద్య,వ్యవసాయం తో పాటు అనేక రంగాలలో సేవలు అందిస్తున్నట్లు తెలిపారు. ఈ వేసవి లో విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు లో ఉచితంగా నేర్పించునున్నట్లు తెలిపారు. ఆరో తరగతి నుంచి ఇంటర్, బీటెక్ విద్యార్థులకు స్పోకెన్ ఇంగ్లీషు తో పాటు అనేక ఇతర కోర్సులను నేర్పించనున్నట్లు తెలిపారు. ఈ విద్యాయాన్ ద్వారా జిల్లాలోని పలు ప్రాంతాలలో కేంద్రాలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. తొలి విడతగా నేలకొండపల్లి మండల కేంద్రంలో ఎవర్‌గ్రీన్ స్కూల్ లో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. జిల్లా లోని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజేషన్ కార్యదర్శి మనోజ్‌కుమార్, పాఠశాల యాజమాన్యం ప్రగతి, ట్యూటర్స్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# సివిల్స్ ర్యాంకర్ సాయి అలేఖ్యకు సన్మానం



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** యుపిఎస్‌సి ఫలితాలలో 938 వ ర్యాంకు సాధించిన రావూరి సాయి అలేఖ్యను త్రివేణి పాఠశాల యాజమాన్యం ఘనంగా సన్మానించింది. త్రివేణి పాఠశాల పూర్వ విద్యార్థి అయిన సాయి అలేఖ్య సివిల్స్‌లో ర్యాంకు సాధించిన సందర్భంగా సోమవారం పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో సాయి అలేఖ్యతో పాటు వారి తల్లిదండ్రులను ఘనంగా సన్మానించారు. సాయి అలేఖ్య త్రివేణి పాఠశాలలో ఏడవ తరగతి నుంచి పదవ తరగతి వరకు విద్యనభ్యసించింది. 2011లో పదవ తరగతిలో 559 మార్కులతో ఉత్తీర్ణత సాధించింది. ఈ సందర్భంగా పాఠశాల డైరెక్టర్ గొల్లపూడి వీరేంద్ర చౌదరి మాట్లాడుతూ తమ పాఠశాలలో చదివిన విద్యార్థులు ఉన్నత శిఖరాలను అధిరోహించడం ఎంతో గర్వంగా ఉందన్నారు. ప్రిన్సిపాల్ రాజేంద్ర ప్రసాద్ మాట్లాడుతూ తమ పూర్వ విద్యార్థిని సివిల్స్‌లో ర్యాంకు సాధించడం తమకు ఎంతో గర్వకారణమన్నారు. ఈ కార్యక్రమంలో త్రివేణి కృష్ణవేణి విద్యా సంస్థల డైరెక్టర్ యార్లగడ్డ వెంకటేశ్వరరావు, సిఆర్‌వో కాట్రగడ్డ మురళీకృష్ణ, సెంట్రల్ టీమ్ మెంబరు సిహెచ్ అప్పారావు, వైస్ ప్రిన్సిపాల్ స్వప్న, ముస్తఫా, అశోక్, క్యాంపస్ ఇంచార్జి ఛార్లెస్, సందీప్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# పెళ్లింట విషాదం

**రోడ్డు ప్రమాదంలో వృద్ధుడు మృతి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పెళ్లి వేడుకలతో సరదాగా గడపాల్సిన కుటుంబంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. రోడ్డు ప్రమాదంలో 60 ఏళ్ల వృద్ధుడు మృతి చెందిన సంఘటన ఖమ్మం నగరంలో సోమవారం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే... రఘునాథపాలెం మండలం బావోజీ తండా గ్రామానికి చెందిన గుగులోత్ హలియా (60) వృద్ధుడు సోమవారం తెల్లవారు జామున ఖమ్మం నగరానికి ద్విచక్ర వాహనంపై కూరగాయల కోసం వస్తూ ఖమ్మం ఇల్లందు ప్రధాన రహదారి ఖానాపురం చెరువు సమీపంలో ముందు వెళ్తున్న లారీని ప్రమాదవశాత్తు వెనక నుండి ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో హలియా అక్కడికక్కడే మృతి చెందాడు. హలియాకు భార్య, ముగ్గురు కుమారులు ఉన్నారు. తన మనవడు చైతన్య వివాహం భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో ఆదివారం రాత్రి జరిగింది. ఆట పాటలతో సందడి సందడిగా గడిపిన హలియా నవ దంపతులతో కలిసి ఇంటికి చేరుకున్నాడు. సోమవారం గ్రామంలో విందు ఏర్పాటు చేయడంతో హలియా తెల్లవారుజామున మంచుకొండ వెళ్లి వంట వాళ్లను కలిసి అక్కడి నుంచి కూరగాయల కోసం ఖమ్మం వస్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటు చేసుకుంది. హలియా మృతి వార్తతో సంతోషంగా గడపాల్సిన ఆ కుటుంబం శోకసంద్రంలో మునిగిపోయింది. కుటుంబ సభ్యుల రోదనలు మిన్నంటాయి. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# ప్రజాపంథా యుద్ధమే నిజమైన పోరాటపు పందా



**ప్రజాపక్షం/సింగరేణి:** సింగరేణి మండలం పేరుపల్లి గ్రామంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ పార్టీ ఆవిర్భావ దినోత్సవం కామ్రేడ్ లెనిన్ జయంతి సందర్భంగా పార్టీ జెండాను ఎగరవేశారు. ఈ సందర్భంగా వై.ప్రకాష్ మాట్లాడుతూ భారతదేశంలో విప్లవం విజయవంతం కావాలంటే అందరికి తినటానికి తిండి ఉండటానికి ఇళ్ళు, బట్ట దున్నుకోవడానికి భూమి కావాలంటే దీర్ఘకాలిక ప్రజా యుద్ధ పందా సరైన మార్గమని, రివిజన్ నిజాన్ని వ్యతిరేకించి ఇదే రోజున 1969 ఏప్రిల్22న లెనిన్ జయంతి సందర్భంగా కామ్రేడ్ చంద్ర పుల్లారెడ్డి నాయకత్వంలో పార్టీ నిర్మాణం జరిగిందని అన్నారు. దాదాపు 15వేల మంది వీరులు వినతలు అమరులయ్యారని, నాటి నుండి నేటి వరకు అనేక అవకాశవాదుల అతివాద ఆర్థికవాద ఒంటెద్దు పోకడలకు గురయ్యే కొంతమంది పెత్తందారులు పార్టీని అనేకసార్లు చీల్చి ప్రజలకు ద్రోహం చేశారని అన్నారు. ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ మండల నాయకులు కె.శ్రీనివాసరెడ్డి, అల్లం గురవయ్య, చంద్రయ్య, నాగేశ్వరరావు, గోపయ్య, రాంబాబు, సుగుణ, లింగమ్మ తదితరులు పాల్గొన్నారు.

# అత్యంత వైభవంగా ప్రతిష్టామహోత్సవం



**ప్రజాపక్షం/నేలకొండపల్లి :** మండలంలోని సుర్దేపల్లి గ్రామంలో శ్రీ గంగా రామలింగేశ్వర సమేత, నాగేంద్ర స్వామి, పోతురాజుల ప్రతిష్టామహోత్సవం కార్యక్రమం సోమవారం అత్యంత వైభవంగా నిర్వహించారు. గ్రామస్తులు, బంధువులతో గ్రామంలో సందడి నెలకొంది. వేద పండితులు మంత్రోచరణ నడుమ ప్రతిష్ట అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం వేలాది మంది కి అన్నదాన కార్యక్రమం ను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవిన్యూ, గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయం ఇంచార్జీ తుంబూరు దయాకర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కోడాలి గోవిందరావు, సీతారాములు, మైశా శంకర్, గరిడేపల్లి రామారావు, కుక్కల హనుమంతరావు, బండారుపల్లి వెంకటేశ్వరరావు, వి.సోమయ్య, పి.వెంకటేశ్వర్లు, నాగేశ్వరరావు, పి.రవి, సుల్తాన్ వీరబాబు తదితరులు పాల్గొన్నారు.

## నేలకొరికిగన పంటలు, విద్యుత్ స్తంభాలు



**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** ఖమ్మం రూరల్ మండలంలో ఆదివారం సాయంత్రం ఉరుములు,ఈదురుగాలులు, వడంగళ్లతో కురిసిన వర్షానికి పంటలు,విద్యుత్ స్థంబాలు నేలకొరిగాయి. గుర్రాలపాడులోని ఇండస్ట్రీయల్‌కు సరఫరాను అందిచే స్థంభం విరిగిపోయింది. దీంతో ఆ పరిధిలో సరఫరా నిలిచిపోయింది. సోమవారం ఉదయం ఏఇ క్రాంతి సింహ్ పరిశీలించి తన సిబ్బందితో దానిని మార్చి కొత్త స్తంభంను ఏర్పాటు చేసి సరఫరాను పునరుద్ధరించారు. ఆరెకోడులో ఒక స్థంభం, ఆరెకోడు తండాలో నాలు స్థంభాలు నేలకొరిగాయి. వీటిని ఏఇ ప్రకాష్ తన సిబ్బందితో కలిసి పరిశీలించి కొత్త స్థంభాలను ఏర్పాటు చేపించి పునరుద్ధరణ చేపించారు. చింతపల్లిలో మొక్కజొన్న పంట చేతికి రావడంతో నేలకొరగిందే తప్ప ఎటువంటి నష్టం వాటిల్లలేదు. ఆరెకోడులో 7ఎకరాల వరకు వరి పంట నేలకొరిగి పోవడంతో రైతులకు రూ.66వేల వరకు నష్టాన్ని మిగిల్చింది. ఏవో నాగేశ్వరరావు వాటిని పరిశీలన చేశారు. కురిసిన వర్షం ఓ వైపు రైతులకు,విద్యుత్‌శాఖకు కొంత నష్టాన్ని కలిగిస్తే మరోవైపు ఇన్ని రోజులు ఎండవేడిమితో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు స్వల్ప ఊరటను ఇచ్చింది.

## పార్లమెంట్ ఎన్నికల ప్రచార ఇన్‌చార్జ్‌గా కొదుమూరి దయాకర్



**ప్రజాపక్షం/చంద్రుగొండ:** రాబోయే ఖమ్మం పార్లమెంట్ ఎన్నికల ప్రచార ఇన్ చార్జ్‌గా, రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనరల్ సెక్రెటరీ కొదుమూరు దయాకర్‌రావు నియమితులయ్యారు. సోమవారం హైదరాబాద్ గాంధీభవన్‌లో నేషనల్ కాంగ్రెస్ పార్టీ సేవాదళ్ జనరల్ సెక్రటరీ తొగాడియా నియామక పత్రాన్ని ఆదివారం అందజేసినట్లు దయాకర్‌రావు తెలిపారు. ఈసందర్భంగా విలేకరులతో మాట్లాడుతూ తనపై నమ్మకంతో ఈ పదవి ఇప్పిచ్చిన ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు మిద్దెల జితేందర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి పార్లమెంట్ అభ్యర్ధిని గెలిచే విధంగా కృషి చేస్తానని అన్నారు. ఈకార్యక్రమంలో పార్టీ నాయకులు కేసుబోయిన నరసింహారావు, మనోహర్, తదితరులు ఉన్నారు.

## పురుగుల మందు తాగి నవ వధువు ఆత్మహత్య




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** చదువుపై ఆసక్తితో పురుగుల మందు త్రాగి ఆత్మహత్య చేసుకొని, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ నవ వధువు మృతి చెందిన సంఘటన సోమవారం మండలంలో వెలుగులోకి వచ్చింది. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం వివరాలు ఇలా ఉన్నాయి. చంద్రుగొండ మండలం మంగయ్య బంజర గ్రామానికి చెందిన భూక్య శ్రీను, పద్మ దంపతులు ఏకైక కుమార్తె భూక్య నీలా(23)ను ఇదే మండలం దుబ్బతండా గ్రామానికి చెందిన గుగులోత్ బాలరాజుతో గత నెల 28న పెండ్లీ చేశారు. ఈనెల 12వ తేదీన నూతన దంపతులను మంగయ్యబంజరకు పుట్టింటికి తీసుకొచ్చారు. ఈక్రమంలో 13వ తేదీ రాత్రి 12గంటల సమయంలో నూతన వధువు నీలా ఇంట్లోని పురుగుల మందు త్రాగి ఆత్మహత్యయత్నానికి పాల్పడగా, కుటుంబ సభ్యులు హుటహుటినా జూలూరుపాడు, అక్కడ నుంచి కొత్తగూడెం ఆసుపత్రికి తరలించారు. కొద్ది రోజుల చికిత్స అనంతరం మెరుగైనా వైద్యం కోసం ఖమ్మంలోని కిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ 21రాత్రి భూక్యా నీలా(23) మృతి చెందింది. నూతన వధువు మృతిపై తహసీల్దార్ సంధ్యారాణి, ఎస్ఐ మాచినేని రవి ఖమ్మం ఆసుపత్రిలో కుటుంబ సభ్యుల నుంచి వివరాలు సేకరించారు. ఉన్నత చదువులు చదవాలనే బలమైనా కోరిక వల్ల తన కూతురు ఆత్మహత్య చేసుకుందని తల్లి పద్మ ఫిర్యాదు మేరకు ఎస్ఐ రవి కేసు నమోదు చేసి దర్యాప్తును చేపట్టారు. నవ వధువు ఆత్మహత్య చేసుకోవడంతో మంగయ్యబంజర, దుబ్బతండా గ్రామాల్లో విషాదఛాయలు అలుముకున్నాయి.

## శివనాగేశ్వరరావుకు స్టేట్ లెవెల్ బెస్ట్ ఈఎంటి అవార్డు



**ప్రజాపక్షం/ మధిర :** ఖమ్మం జిల్లా మధిర నివాసి 108 ఎమర్జెన్సీ మెడికల్ టెక్నిషియన్ గజ్జలకొండ శివ నాగేశ్వరరావు అత్యవసర సేవలు అందించినందుకు స్టేట్ లెవెల్ బెస్ట్ ఈఎంటి అవార్డును అందుకున్నారు. మేడ్చల్ మల్కాజిగిరి జిల్లాలో 108 అత్యవసర సేవలు అందించినందుకుగాను తెలంగాణ స్టేట్ లెవెల్ బెస్ట్ ఈఎంటి అవార్డును సోమవారం హైద్రాబాద్‌లోని జివికె ఈఎంఆర్ఐ గ్రీన్ హెల్త్ సర్వీస్ హెడ్ ఎం.ఎ. ఖలీదు, డైరెక్టర్ వెంకటేశం చేతుల మీదుగా అవార్డును అందుకోవటం జరిగింది. అవార్డు అందుకున్న శివనాగేశ్వరరావును 108 ప్రొగాం మేనేజర్ జాన్ సైదా, భూమా నాగేంద్ర, నజీర్, శికుమార్, తోటి ఉద్యోగులు, కుటుంబసభ్యులు అభినందించారు.

## ఘనంగా బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి ప్రతిష్ఠ





**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** బొడ్రాయి నాబిశిల, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. సోమవారం రఘునాథపాలెం మండల పరిధిలోని ఈర్లపుడి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన బొడ్రాయి నాబిశిల, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం వేద పండితుల మంత్రోచ్చరణల నడుమ, భక్తజన సందోహం నడుమ ఘనంగా నిర్వహించారు. బొడ్రాయి, ముత్యాలమ్మ తల్లి విగ్రహ ప్రతిష్ఠ సందర్భంగా గ్రామంలో పండుగ వాతావరణం నెలకొంది. బంధువుల రాకతో ప్రతి ఇల్లు సందడిగా ఉంది. భక్తులకు అన్నదానం చేశారు. ప్రతిష్ఠ మహోత్సవంలో రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు మంత్రి తుమ్మల నాగేశ్వరరావును ఈ సందర్భంగా సన్మానించారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి క్యాంపు కార్యాలయ ఇంచార్జి తుంబూరు దయాకర్ రెడ్డి, బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు వీరు నాయక్ ప్రతిష్టా మహోత్సవంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నాయకులు దేవ్‌సింగ్, వాంకుడోత్ దీపక్ నాయక్, మారం కరుణాకర్‌రెడ్డి, మదూరి సైదారావు, పలువురునాయకులు తదితరులు పాల్గొన్నారు.

## నామపై నిలబడేందుకు కాంగ్రెస్‌కు అభ్యర్థి దొరకడం లేదు




**ఎన్నికల ప్రచారంలో బిఆర్ఎస్ నేతలు**

**ప్రజాపక్షం/ఖమ్మం రూరల్ :** అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన మోసపూరితహామీలను నమ్మి మోసపోయారని...ఆ తప్పును పార్లమెంట్ ఎన్నికల్లో జరగకుండా చూసుకోవాలని ఖమ్మం బిఆర్ఎస్ అభ్యర్థి నామా నాగేశ్వరరావు ప్రజలకు విజ్ఞప్తి చేశారు. సోమవారం పోలేపల్లి గ్రామంలో గల సివిఆర్ ఫంక్షన్‌హాల్‌లో ఖమ్మం రూరల్ మండల బిఆర్ఎస్ పార్టీ విస్తృత స్థాయి సమావేశాన్ని బిఆర్ఎస్ మండల అధ్యక్షుడు బెల్లం వేణు అధ్యక్షతన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీ అభ్యర్థి నామా నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, పాలేరు మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్‌రెడ్డి, ఎమ్మెల్సీ, బిఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు తాతా మధు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా నామా మాట్లాడారు...పాలేరు ప్రజలను తన కుటుంబ సభ్యులుగా భావించి రాజకీయాలకు అతీతంగా ప్రతి ఒక్కరికి ఐదేండ్లు పలు రకాలుగా అండగా నిలిచిన ఉపేందర్‌రెడ్డి ఓడిపోవడం తనను ఎంతో భాదించిందన్నారు. ఈ ఓటమిలో కాంగ్రెస్ మోసపూరిత హామీలు ఉన్నాయి కాదనడం లేదు. కానీ మిమ్మల్ని కంటికిరెప్పలా కాచుకుని ఎటువంటి తప్పు చేయని వ్యక్తిని ఓడించుకోవడం ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన అంశం అన్నారు. తనకు ఎన్ని ఇబ్బందులు ఉన్నప్పటికీ పక్కన పెట్టి నా ప్రజలు సంతోషంగా ఉండాలని ప్రతిక్షణం తపన పడిని వ్యక్తి ఓడిపోకుండా ఉండాల్సిందన్నారు. జరిగిపోయిన తప్పు ఎలానో జరిగిందని నేను,కందాళ కేసీఆర్‌కు హామీ ఇచ్చామని పార్లమెంట్ ఎన్నికల్లో పాలేరు నుంచి 55వేల మెజార్టీ వస్తుందని అన్నారు. మాజీ ఎమ్మెల్యే కందాళ ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ...నేను ప్రజలు ఇచ్చిన ఆశీర్వాదంతో ఎమ్మెల్యేగా గెలుపొంది పాలేరులో కుల,మతాలకు అతీతంగా పని చేశాను. ఏ ఒక్కరూ తనకు ఫోన్ చేసి సహాయం కావాలని కోరినా ఎటువంటి రాజకీయాలకు తావివ్వకుండా పని చేశానన్నారు. ఎందుకంటే పాలేరు నాకు పురుడు పోసిన ఊరు, ఇక్కడి ప్రజలు నా కుటుంబ సభ్యులు అనే దక్షతతోనే శక్తి వంచన లేకుండా పనిచేశానన్నారు. ఇప్పటికీ పాలేరు నుంచి ప్రజలు తనకు ఫోన్ చేసి సార్ తమకు పలాన సమస్య ఉందటూ ఫోన్ చేస్తున్నారని అన్నారు. అదేవిధంగా విద్యార్థులు తమ ఫీజులకు డబ్బులు లేవని కోరుతున్నారని వాటన్నింటిని తాను చేస్తునే ఉన్నానన్నారు. జరిగిన విషయాన్ని మరిచి పోయి ప్రజలను నేను కోరానని చెప్పి నామాకు కారు గుర్తుపై ఓటు వేసి ఆశీర్వాదించాలని ప్రజలను కోరాల్సిందిగా శ్రేణులకు సూచించారు. ఎమ్మెల్సీ తాతా మధు మాట్లాడుతూ...నామా నాగేశ్వరరావుపై నిలబడేందుకు కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి దొరకడం లేదన్నారు. కానీ బిఆర్ఎస్ పార్టీ నామాకు ఎప్పుడో టికెట్ ఇచ్చి ప్రజక్షేత్రంలోకి పంపిచిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మాత్రం ఇంకా వెతుకులాడుకుంటుందని ఎద్దేవ చేశారు. కాంగ్రెస్‌కి ప్రజాస్వాయ్యం అన్న ప్రజలన్న గౌరవం లేదనడానికి ఇది నిదర్శనం అన్నారు. కాంగ్రెస్‌కు ఓటు వేసి తప్పు చేశామని ప్రజలంతా ఆలోచిస్తున్నారన్నారు. ప్రధానంగా పాలేరులో కందాళను ఓడించుకోవడంపై అన్ని పార్టీల వారు సైతం ఆవేదన వ్యక్తం చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ బెల్లం ఉమా, వైస్ ఎంపిపి గుడియి దర్గయ్య, జెడ్పిటీసీ యండపల్లి వర ప్రసాద్, ఏదులాపురం సొసైటీచైర్మన్ జర్పుల లక్ష్మణ్ నాయక్, బిఆర్ఎస్ పార్టీ మండల కార్యదర్శి పేరం వెంకటేశ్వర్లు, ప్రజాప్రతినిధులు, నాయకులు, పాల్గొన్నారు.

## అధికారులంతా సమన్వయంతో పని చేయాలి

**-మావోయిస్టు ప్రభావిత ప్రాంతాల్లో డిజిపి పర్యటన**






**ప్రజాపక్షం/బూర్గంపాడు:** రాబోయే పార్లమెంట్ ఎన్నికలు సజావుగా జరిగేలా అధికారులంతా సమన్వయంతో పని చేయాలని డిజిపి రవి గుప్తా అన్నారు. సోమవారం హెలికాప్టర్ ద్వారా సారపాక ఐటిసి గెస్ట్ హౌస్‌కు చేరుకొని అక్కడ భద్రాద్రి కొత్తగూడెం, ములుగు, భూపాలపల్లి జిల్లాల పోలీస్ అధికారులతో ఏర్పాటు చేసిన సమీక్షా సమావేశంలో ఆయన పాల్గొన్నారు. ముందుగా మూడు జిల్లాల ఎస్‌పిలతో ప్రస్తుత స్థితిగతులకు అడిగి తెలుసుకున్నారు. అనంతరం డిజిపి మాట్లాడుతూ రాబోయే పార్లమెంట్ ఎన్నికల దృష్ట్యా ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పొరుగు రాష్ట్రాల సరిహద్దు అధికారులతో సమన్వయం పాటిస్తూ పటిష్టమైన చర్యలు చేపట్టాలని సూచించారు. చెక్ పోస్ట్ వద్ద అధికారులు ఎప్పటికప్పుడు అప్రమత్తంగా ఉంటూ అక్రమంగా నగదు, మద్యం రవాణాను అడ్డుకోవాలని సూచించారు. గత ఎన్నికల్లో మాదిరిగానే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మావోయిస్టు ప్రభావిత పోలింగ్ కేంద్రాల్లో పటిష్టమైన బందోబస్తును ఏర్పాటు చేసుకొని అధికారులు సమన్వయంతో పని చేయాలని తెలిపారు. అనంతరం డిపిజితో పాటు అధికారులందరూ భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామిని దర్శించుకున్నారు. ఈసమావేశంలో జిల్లా ఎస్‌పి రోహిత్ రాజు, ములుగు ఎస్పీ డాక్టర్ శబరీష్, భూపాలపల్లి ఎస్‌పి కిరణ్ ప్రభాకర్ ఖరే, ఎస్ఐబి ఎస్పీ రాజేష్, ఓఎస్డీ కొత్తగూడెం సాయి మనోహర్, భద్రాచలం ఏఎస్‌పి పరితోష్ పంకజ్, ఏటూరునాగారం ఏఎస్‌పి మహేష్ జితే, ట్రైనీ ఐపిఎస్ విక్రాంత్ సింగ్, సిఆర్‌పిఎఫ్ అధికారులు ఆర్‌కె పాండా, ఎంకె మీనా, మోహన్, రితేష్‌కుమార్, డిఎస్‌పిలు, సిఐలు, ఎస్ఐలు తదితరులు పాల్గొన్నారు.

## భరత్ మృతి దురదృష్టకరం : కూనంనేని

**పగడాల భరత్‌కు పలువురి నివాళి**



**ప్రజాపక్షం/ ఖమ్మం అర్బన్ :** పగడాల భరత్ మృతి అత్యంత దురదృష్టకరమని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం శాసన సభ్యులు కూనంనేని సాంబశివరావు తెలిపారు. ఉద్యమ నేపథ్యం కలిగిన కుటుంబంలో జన్మించి ఎంతో భవిష్యత్తు ఉన్న భరత్ మరణించడం అత్యంత బాధాకరమన్నారు. సోమవారం ఖమ్మం కార్పోరేషన్ పరిధిలోని 14వ డివిజన్ కొత్తగూడెంలో పగడాల భరత్ సంస్మరణ సభ జరిగింది. ఈ సందర్భంగా భరత్ చిత్ర పటానికి కూనంనేని సాంబశివరావు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సభలో కూనంనేని మాట్లాడుతూ యువతరం ఈ దేశానికి అవసరమున్న దశలో భరత్ లేకపోవడం దురదృష్టకరమన్నారు. భరత్ మృతి మల్లేష్ కుటుంబానికి తీవ్ర విషాదాన్ని మిగిల్చిందని ఆయన తెలిపారు. నివాళులర్పించిన వారిలో సిపిఐ జాతీయ సమితి సభ్యులు బాగం హేమంతరావు, జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్, జిల్లా కార్యవర్గ సభ్యులు జమ్ముల జితేందర్ రెడ్డి, ఎస్‌కె జానిమియా, పోటు కళావతి, తాటి వెంకటేశ్వరరావు, సిహెచ్ సీతామహాలక్ష్మి , రావి శివరామకృష్ణ, జిల్లా నాయకులు తాటి నిర్మల, గాదె లక్ష్మి నారాయణ, ఏఐటియుసి నాయకులు మోహన్‌రావు, కార్పొరేటర్ చామకూరి వెంకన్న, దోరేపల్లి శ్వేత, కాంగ్రెస్ నాయకులు బొమ్మిశెట్టి సత్యం, వి. మల్లయ్య, సంక్రాంతి నాగేశ్వరరావు, మందడపు బ్రహ్మారెడ్డి, బైరు హరినాథ్‌బాబు, సీతల రామసంగం, చేతుల నాగేశ్వరరావు, గోవిందరావు, చింతకాయల వెంకటేశ్వర్లు, రావుల హన్మంతరావు, జొన్నలగడ్డ వెంకటేశ్వర్లు, పోతురాజు వెంకటేశ్వర్లు, మేడా చిన్న, ప్రసాద్, ఎస్‌కె మీరా, వివిధ పార్టీల నాయకులు, బంధువులు నివాళులర్పించారు.

## పార్లమెంట్ ఎన్నికల్లో నామను గెలిపించండి



**ప్రజాపక్షం/సింరేగణి:** సింగరేణి మండలంలో బిఆర్ఎస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశం వైఎస్ఎన్ ఫంక్షన్ హాల్‌లో వైరా నియోజకవర్గ ఇంచార్జి మాజీ శాసనసభ్యులు బానోతు మదన్లాల్ నాయకత్వంలో నిర్వహించడం జరిగింది. మదన్‌లాల్ మాట్లాడుతూ ఖమ్మం జిల్లా బిడ్డ రెండుసార్లు ఎంపిగా పనిచేసిన అనుభవం ఖమ్మం జిల్లాను అభివృద్ధి పరచడంలో ముందున్న వ్యక్తి నామ నాగేశ్వరరావు, నామ నాగేశ్వరరావును ఖమ్మం జిల్లాలో వైరా నియోజకవర్గంలోనే అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కార్యకర్తలు కోరారు.

**కష్టకాలంలో బిఆరెస్ పార్టీని కాపాడండి : మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్**

మాజీ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ మాట్లాడుతూ నాలుగు నెలల్లోనే కాంగ్రెస్ పార్టీపై వ్యతిరేకత వచ్చిందని, కాంగ్రెస్ ప్రభుత్వం హామీలను నెరవేర్చడంలో విఫలమైందని, లోక్‌సభ ఎన్నికల్లో బిఆర్ఎస్ పార్టీ 12 సీట్లను గెలవబోతుందని చెప్పడం జరిగింది. ఎంపి నామ నాగేశ్వరరావు అత్యధిక మెజార్టీతో గెలవబోతున్నాడని, బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తలు కష్టకాలంలో బిఆర్ఎస్ పార్టీని కార్యకర్తలు కాపాడాలని కోరారు.

**బడుగు బలహీన వర్గాల ఆశాజ్యోతి కెసిఆర్: రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి**

రాజ్యసభ సభ్యులు గాయత్రి రవి మాట్లాడుతూ కెసిఆర్ బడుగు, బలహీన వర్గాల ఆశాజ్యోతి అని రాష్ట్రంలో బిఆర్ఎస్ పార్టీకి ఉన్న ఒక్క రాజ్యసభ సీటు ఒక బిసి వ్యక్తికి ఇవ్వడం అనేది ఒక గొప్ప విషయం అని, అందుకే కెసిఆర్ ఎస్సీ, ఎస్టీ, బిసి ప్రజలు రుణపడి ఉండాలని, అమదుకే రానున్న లోక్‌సభ ఎన్నికల్లో ఎంపి నామ నాగేశ్వరరావును భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు.

**రైతు బిడ్డను, నన్ను గెలిపించండి: నామ నాగేశ్వరరావు**

ఎంపి నామ నాగేశ్వరరావు మాట్లాడుతూ నేను రైతు బిడ్డను, ఎప్పుడు పేదల కోసం పనిచేసే వ్యక్తి అని మీకు ఎప్పుడు అందుబాటులో ఉండే వ్యక్తిని అని ఖమ్మం జిల్లాను అభివృద్ధిపరిచిన దానిలో మొదటి వ్యక్తి అని నన్ను రానున్న ఎన్నికల్లో నా కారు గుర్తు ఓటు వేసి నన్ను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి వాంకుడోతు జగన్, మాజీ జెడ్పిటిసి ఉన్నం వీరేందర్, మాజీ రైతు సమన్వయ కమిటీ అధ్యక్షుడు హన్మకొండ రమేష్, బిఆర్ఎస్ పార్టీ మండల ప్రధాన కార్యదర్శి ఇస్లావత్ బన్సిలాల్, జిల్లా నాయకులు జడల వెంకటేశ్వర్లు, బత్తుల శ్రీను, నర్సింగ్ శ్రీనివాస్, రవి, గౌస్, ఎంపిటిసిలు శంకర్, జ్యోతి, నాయకులు, గుగులోతు వీరన్న, లకావత్ లక్ష్మణ్, చందు తదితరులు పాల్గొన్నారు.

## అసమానతలు లేని సమాజమే సిపిఐ లక్ష్యం

**-దేశ సంపద కార్పోరేటర్లకు దోచిపెట్టిన మోడీ**
**-సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా**





**ప్రజాపక్షం/ఖమ్మం:** అసమానతలు లేని సమాజమే సిపిఐ లక్ష్యమని సిపిఐ జిల్లా కార్యదర్శి ఎస్‌కే సాబీర్ పాషా అన్నారు. సోమవారం ఆళ్లపల్లిలో సిపిఐ అత్యవసర సమావేశం సిపిఐ మండల కార్యదర్శి గొగ్గెల కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ అధికారం లేకపోతే అధోగతి పాలుఅవుతుందని, అధికారం పోయి వంద రోజులు కాకముందే బిఆర్ఎస్ నాయకులు పార్టీలు మారుతున్నారని విమర్శించారు. అధికారం ఉన్న లేకపోయినా సిపిఐ పార్టీ 100 సంవత్సరాలు ప్రజల పక్షానే ఉండి, ప్రజల కోసం నిలబడిందన్నారు. ప్రజా గొంతుకగా ప్రజల కోసం శ్రమించే పార్టీ సిపిఐ అని తెలిపారు. దేశ సందపను కార్పోరేటర్లకు మోడీ దోచిపెడుతున్నారని, రానున్న ఎన్నికల్లో బిజెపికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. అనంతరం పలువురు సిపిఐ పార్టీలో చేరారు. వారిని సాదరంగా పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు ఎం వెంకటేశ్వర్లు, కండే రాంబాబు, కండే రామ్మూర్తి, ఎం వెంకటేశ్వర్లు, బొబ్బిలి బాబులు ఉన్నారు. గతంలో వీరు సిపిఐ పార్టీలో ఉండి దళితబంధు కోసం బిఆర్ఎస్ చేరారు. నేడు తిరిగి అమ్మఒడి వంటి సిపిఐ పార్టీలోకి తిరిగి చేరడం పట్ల వారు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. అనంతరం లెనిన్ 154వ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈకార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు, వైస్ ఎంపిపి రేసు ఎల్లయ్య, సిపిఐ మండల సహాయ కార్యదర్శి పగడయ్య, రాంబాబు, మండల కోఆప్షన్ సభ్యులు రహీమ్, మాజీ జెడ్పిటిసి లక్ష్మి , గుండాల మండల కార్యదర్శి రమేష్, షాహిద్, మల్లేష్, శివ, ఇమ్మానియేల్, లాజర్, సహదేవ్, మద్దెల వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

## బ్రిలియంట్‌లో పండగలా వీడ్కోలు మహోత్సవం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** సారపాకలో గల బ్రిలియంట్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో సోమవారం ఎస్ఏ 2 పరీక్షలు ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకొని పాఠశాల విద్యార్థులకు వీడ్కోలును ఒక పండగ వాతావరణాన్ని నెలకొనేలా బ్రిలియంట్ విద్యా సంస్థల ఛైర్మన్ బిఎన్ఆర్ విద్యార్థులకు ఉత్తేజాన్ని నింపారు. ఈ వీడ్కోలు పండల మహోత్సవంలో విద్యార్థులను ఉద్దేశించి ఆయన మాట్లాడుతూ ఈ అకాడమిక్ సంవత్సరం మొత్తం విద్యార్థులు, సైనిక్, నవోదయ, ఒలంపియాడ్, చెకుముఖి, ఎస్ఎఫ్ఐ, ఇలా ఏ పరీక్షలైన మన బ్రిలియంట్ విద్యార్థులు సాధించిన విజయాలు ఎంతో గొప్పవని, విద్యతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రతీ నైపుణ్యంలో బ్రిలియంట్ విద్యార్థులు జిల్లాలోనే చరిత్ర సృష్టించడం గర్వించదగిన విషయమని కొనియాడారు. అనంతరం విద్యార్థులు ఆనంద, కేరింతలతో డాన్సలతో ఉర్రూతలూగించారు. అదే విధంగా విద్యార్థులకు , వివిధ నైపుణ్యాల గల విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈకార్యక్రమంలో బ్రిలియంట్ విద్యాసంస్థల యాజమాన్యం, అధ్యాపక బృందం, పాఠశాల విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## నూతన వధూవరులను ఆశీర్వదించిన శ్రీలత



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** టేకులచెరువు గ్రామ పంచాయితీలో గల కొత్త తండా గ్రామంలో తేజావత్ ఈర్యనాయక్, కౌసల్య దంపతులు కుమారుడు కళ్యాణ్ వెడ్స్ స్వాతిల రిసెప్షన్ వేడుకకు జెడ్‌పిటిసి కామిరెడ్డి శ్రీలత హాజరయ్యారు. ఈసందర్భంగా నూతన వధువరులను అక్షింతలు వేసి ఆశీర్వదించారు. ఈకార్యక్రమంలో లక్ష్మీపురం బిఆర్ఎస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు పోతిరెడ్డి గోవింద్‌రెడ్డి, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

## వేపలగడ్డలో ఓటు హక్కు వినియోగించుకునేందుకు ఆమోదం



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** వేపలగడ్డ గ్రామానికి చెందిన ఓటర్లు ఇకపై వేపలగడ్డ గ్రామంలోనే ఓటు హక్కును వినియోగించుకొనేందుకు ఆమోదం లభించిందని తహసీల్దార్ ముజాహిద్ అన్నారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఇతరకు ముందు మోరంపల్లిబంజర్ గ్రామంలో గల పోలింగ్ స్టేషన్ నంబర్ 237 ఎంపిపిఎస్ లో సుమారు 852 ఓటర్లు వేపలగడ్డకి చెందిన వారు ఉన్నారని, వారు ఓటు హక్కు వినియోగించుకోవడానికి సుమారు 2కిలో మీటర్లు ప్రయాణించాల్సి వస్తుందని, అట్టి పోలింగ్ స్టేషన్‌ను గిరిజన ప్రైమరీ స్కూల్ వేపలగడ్డకు మార్చడం జరిగిందన్నారు. ఇందుకు సంబంధించి జిల్లా ఎన్నికల అధికారి అట్టి ప్రోపోసల్‌ను ఆమోదించడం జరిగిందన్నారు. కావున ఇప్పటి నుంచి వేపలగడ్డలో ఉన్నటువంటి ఓటర్లు తమ ఓట్లను వేపలగడ్డలోనే వినియోగించుకోవాలని తెలిపారు. అదే విధంగా బూర్గంపాడు మండలంలోని పోలింగ్ స్టేషన్ నెంబర్ 227 ప్రభుత్వ జూనియర్ కళాశాల యొక్క పోలింగ్ స్టేషన్ పేరు తప్పుగా ఎంపిపిఎస్ బూర్గంపాడుగా నమోదు అయిందని, కావున ఆ పేరుని ప్రభుత్వ జూనియర్ కళాశాలగా మార్చడం జరిగిందని తెలిపారు.

## వడ దెబ్బకు వికలాంగురాలు మృతి



**ప్రజాపక్షం/బూర్గంపాడు:** వడదెబ్బకు వికలాంగురాలు మృతి చెందిన సంఘటన నాగినేని ప్రోలురెడ్డిపాలెం గ్రామంలో సోమవారం చోటుచేసుకుంది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. నాలుగు రోజుల నుండి ఎండ వేడిమికి తట్టుకోలేక అంబటి కళావతి(51) వడదెబ్బ తలిగి మృతి చెందినట్లు తెలిపారు. మృతురాలు వికలాంగురాలు వివాహం కాలేదు. తండ్రి చిన్నపరెడ్డి, సీతమ్మతోనే నివాసం ఉంటుంది.

## తిప్పనపల్లిలో ఇంటిపై పడ్డ భారీ వేపచెట్టు




**ప్రజాపక్షం/చంద్రుగొండ:** తిప్పనపల్లి గ్రామానికి చెందిన షేక్ నబీ కుటుంబ సభ్యులతో ఇంట్లో నిద్రిస్తుండగా ఆదివారం రాత్రి ఒక్కసారిగా వేపచెట్టు గాలి దుమరానికి ఇంటిపై పడింది. ఇంటిపై కప్పు రేకులు పగిలిపోయాయి. ఇంటి గోడలు బీటలు వారినాయి. గోడలు పగుళ్లు ఏర్పడ్డాయి. ఇల్లు మొత్తం దెబ్బతినడంతో ఆ ఇంటిలో గల కుటుంబ సభ్యులు బాధలో ఉన్నారు. వేపచెట్టు పడి దెబ్బతిన్న ఇంటి యజమానిని అన్ని విధాలా ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

# గుట్ట ఆక్రమణపై నివేదిక సిద్ధం

**-ఆ ఇద్దరిపై వేటు..?**
**-ఆక్రమణలపై కలెక్టర్ సీరియస్**






ప్రజాపక్షం/వైరా: వైరా మున్సిపాలిటీ పరిధిలోని సర్వే నెంబర్ 98లో ఉన్న గుట్టను గుట్ట ప్రక్కన ఉన్న కొంతం రామిరెడ్డి పేరు మీద 275.55 గజాలు స్థలం ఉంది. ఆ స్థలం ఆయన భార్య కొంతం అచ్చమ్మ పేరు మీద ఉన్న 275.55 గజాలు స్థలాన్ని తల్లాడ మండలం కుర్నవల్లికి చెందిన శీలం సాయిప్రియాంక పేరు మీద 709.55 గజాలుగా రిజిస్ట్రేషన్ చేశారు. అంటే 434 గజాలు స్థలం ఎక్కువగా రిజిస్ట్రేషన్ చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ భూముల ఆక్రమణపై ప్రత్యేక దృష్టి పెట్టింది. రెవెన్యూ శాఖమంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రభుత్వ భూములు ఆక్రమణపై పలుసార్లు అధికారులకు కీలక ఆదేశాలు ఇటీవల జారీ చేశారు. దాంతో జిల్లా కలెక్టర్ గౌతమ్ ప్రభుత్వ బూములు ఆక్రమణలు గుర్తించి వాటిని కాపాడాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో 98 సర్వే నెంబర్లో ఉన్న గుట్ట ఆక్రమణలపై రెవెన్యూ అధికారులు విచారణ ప్రారంభించారు. గత బిఆర్ఎస్ ప్రభుత్వ పాలనలో సర్వే నెంబర్ 98లో గుట్ట రిజిస్ట్రేషన్ జరిగినట్లు అధికారులు గుర్తించి దానిపై నివేదిక సిద్ధం చేశారు. ఇప్పటికే జిల్లా కలెక్టర్ గుట్ట ఆక్రమణకు సంబంధించి విషయాన్ని తెలుసుకున్నారు. ప్రభుత్వ భూములు ఆక్రమణ చేసిన ఆక్రమించుకున్న తప్పుడు రిజిస్ట్రేషన్ చేసిన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకోవాలని ప్రభుత్వ భూములను గుర్తించి వారికి కాంపౌండ్ చేసి భూములను రక్షించాలని ఇటీవల కాంలో జిల్లా కలెక్టర్ గౌతమ్ అధికారులకు పదేపదే చెప్పారు. అయితే గుట్ట రిజిస్ట్రేషన్‌కు సంబంధించి అప్పటి ఇద్దరు అధికారులపై చర్యలు తప్పవని వినిపిస్తున్నాయి. ఎందుకంటే ఆ ఇద్దరు అధికారులు ప్రభుత్వ గుట్టను రిజిస్ట్రేషన్ చేయడంతో ఓ ప్రజాప్రతినిధితో కలిసి ప్రభుత్వ భూమిని రిజిస్ట్రేషన్ చేయడంతో కీలకంగా వ్యవహరించారని ఆరోపణలు లేకపోలేదు. గుట్ట విచారణ జరిపిన రెవెన్యూ అధికారులు అసలు 275.55 గజాలు ఉన్న భూమి 709.55 గజాలుగా ఎలా రిజిస్ట్రేషన్ చేశారు అనే దానిపై విచారణ జరిపి 434 గజాలు గుట్ట ఆక్రమణ జరిగిందని నిర్ధారించారు. దీంతో గుట్ట ఆక్రణకు కారకులైన వారిపై కూడా చర్యలు చేపట్టే అవకాశం ఉందని అధికారులు తెలుపుతున్నారు. మరోపక్క జిల్లా కలెక్టర్ ఆదేశాలతో గుట్ట తప్పుడు రిజిస్ట్రేషన్ రద్దు చేసేందుకు రిజిస్ట్రేషన్ శాఖకు నోటీసులు రెవెన్యూ అధికారులు పంపన్నుట్లు సమాచారం.


## భగీరథ ఇన్‌టేక్ వెల్ నుండి బోడేపూడి సుజల స్రవంతికి పైప్‌లైన్ ఏర్పాటు





ప్రజాపక్షం/వైరా: వైరా రిజర్వాయర్‌లో నీటి నిల్వ 8.5 అడుగులకు పడిపోవడంతో బోడేపూడి సుజల స్రవంతి ద్వారా త్రాగునీటి అందించడానికి ఇబ్బందిరకంగా మారింది. ఈ క్రమంలో జెసిబితో మోటార్లకు నీరు అందేందుకు గాడి కొట్టిన ఫలితం లేకపోవడంతో మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుండి నేరుగా బోడేపూడి సుజల స్రవంతికి త్రాగునీరు అందించడానికి మిషన్ భగీరథ అధికారులు ప్రత్యేక ప్రత్యామ్నాయ ఏర్పాట్లను ప్రారంభించారు. అందులో భాగంగా మిషన్ భగీరథ ఇన్‌టేక్‌వెల్ నుండి బోడేపూడి సుజల స్రవంతికి వెళ్లే బ్రాహ్మణపల్లి మోటార్ పైప్‌లైన్స్‌కు పైప్‌లైన్‌ను ఏర్పాటు చేస్తున్నారు. దానికి సంబంధించి పైపులు భూమిలో వేసేందుకు ఏర్పాట్లు చేసి పైపులు మధ్య వెల్డింగ్ సైతం పెడుతున్నారు. ముందస్తు చర్యల్లో భాగంగా బోడేపూడి సుజల స్రవంతి ద్వారా త్రాగునీటికి ఎలాంటి ఇబ్బంది కలగకుండా ఉండేందుకు బోడేపూడి సుజల స్రవంతికి మిషన్ భగీరథ ఇన్‌టేక్ వెల్ నుండి నీటిని సరఫరా చేయనున్నారు. అయితే ప్రస్తుతం రిజర్వాయర్‌లో ఉన్న నీటి నిల్వ మరింత తగ్గే ప్రమాదం లేకపోలేదు.

## అమ్మపాలెంలో కన్నులపండువగా దేవతల విగ్రహప్రతిష్ఠ



ప్రజాపక్షం/కొణిజర్ల : మండల పరిధిలోని అమ్మపాలెం గ్రామంలో సోమవారం శ్రీ సీతారామచంద్రస్వామి , వీరాంజనేయస్వామి , సీతలా పరమేశ్వరి దేవతల విగ్రహప్రతిష్ఠ కన్నులపండువగా జరిగింది. దీంతో పాటు నాభిశిల (బొడ్రాయి) పునః ప్రతిష్ఠ కార్యక్రమం జరిగింది. వేద పండితులు కేతముక్కల సురేష్‌కుమార్ , వ్యాకరణం కిషోర్‌శర్మ ల ఆధ్వర్యంలో ఉదయం నుంచే నూతనంగా నిర్మించిన రెండు ఆలయాల్లో ప్రత్యేకపూజలు నిర్వహించారు. రెండు ఆలయాల్లో దేవతామూర్తుల విగ్రహాల ప్రతిష్ఠతోపాటు బొడ్రాయి పునః ప్రతిష్ఠ కార్యక్రమం కూడా చేయడంతో గ్రామంలోని ప్రజల బంధువులతోపాటు చుట్టుప్రక్కల గ్రామాలనుంచి భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. గ్రామం మొత్తం పండుగ వాతావరణం నెలకొంది. రామాలయంలో ఆబోతుకు అచ్చువేశారు. గ్రామంలోని రెండు ఆలయాల్లో ధ్వజస్తం ప్రతిష్టకూడా జరిగింది. దీంతో గ్రామంలోని ఆడబిడ్డలతోపాటు కుటుంబాల్లోని మహిళలు పెద్ద ఎత్తున బోనమెత్తారు. గ్రామం మొత్తం ఇసుకవేస్తే రాలనంత భక్తులు హాజరయ్యారు. ప్రజలకు తీర్థప్రసాదాలు వితరణతోపాటు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటి సభ్యులు కిలారు కిరణ్‌కుమార్ , వెంపటి పరుశురాములు , కోసూరి వెంకటలాలు , పొట్లపల్లి వెంకన్న , శవగాని సైదులు , పుప్పాల రామలింగయ్య, జడ మల్లేషయాదవ్ , బొమ్మగాని భాస్కర్ అన్ని సౌకర్యాలు ఏర్పాటు చేశారు. భక్తులు తమ కోర్కెలు నెరవేరాలని మొక్కుకున్నారు.

## ఎస్‌ఎఫ్‌ఐ ఆధ్వర్యంలో లెనిన్ జయంతి




ప్రజాపక్షం/వైరా: అధ్యయనం పురోగతికి మార్గం అని, అధ్యయనం ద్వారా పురిపూర్ణమైన అవగాహన ఏర్పడుతుందని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు అన్నారు. సోమవారం సోవియట్ విప్లవ పితామహుడు లెనిన్ 154వ జయంతి సందర్భంగా బోడేపూడి వెంకటేశ్వరరావు భవన్‌లో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో చే భగత్ అధ్యయన కేంద్రం ప్రారంభించారు. ఈ సందర్భంగా లెనిన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాంబాబు మాట్లాడుతూ ప్రపంచంలో శ్రామిక అధికారం మాత్రమే పెట్టుబడిదారి వ్యవస్థ సృష్టించిన అసమానతలను రూపుమాపుతుందని నిరూపించిన గొప్ప సోషలిస్ట్ నిర్మాణ దక్షకుడు లెనిన్ అన్నారు. సోవియట్ యూనియన్ విజయం మూడో ప్రపంచ దేశాల్లో వలస పాలనకు వ్యతిరేకంగా ఉద్యమం కొనసాగుటకు ప్రేరణ అని అన్నారు. భారతదేశ అభివృద్ధికి సోషలిస్ట్ సోవియట్ యూనియన్ అందించిన సహకారం మరువలేదని అన్నారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ప్రేమ్‌కుమార్, ఎస్ఎఫ్ఐ వైరా నియోజకవర్గ అధ్యక్షులు పుప్పాల నాగరాజు, నాయకులు వేమూరి అజయ్, హేమంత్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

## రోడ్డు ప్రమాదంలో దంపతులు మృతి







ప్రజాపక్షం/వైరా: వైరా మండలం సోమవరం గ్రామానికి చెందిన సామినేని రాంబాబు కొడుకు కోడలు సామినేని నవీన్‌రాజా(29), సామినేని భార్గవి(24) రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన సంఘటన సోమవారం చోటు చేసుకుంది. బంధువులు తెలిపిన వివరాల ప్రకారం హైదరాబాద్ నుండి కారులో విజయవాడ వెళుతున్న నవీన్‌రాజా, భార్గవి దంపతులు సూర్యాపేట జిల్లా మునగాల మండలం ముకుందపురం వద్ద ఆగివున్న కంటైనర్ క్రిందకు కారు దూసుకుపోవడంతో ఇద్దరు మృతి చెందారు. నవీన్‌రాజా, భార్గవి దంపతులకు పెళ్లి అయి రెండు సంవత్సరాలు అవుతుంది. నవీన్‌రాజా విజయవాడ శ్రీచైతన్య కాలేజీలో లెక్చరర్‌గా పనిచేస్తున్నాడు. హైదరాబాద్ నుండి విజయవాడుకు కాలేజీకి పోతుండగా ఈ ప్రమాదం జరిగింది. వారి మృతితో కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి.

## పార్లమెంట్ ఎన్నికల్లో బిఆర్ఎస్‌దే విజయం



ప్రజాపక్షం/ అశ్వారావుపేట : త్వరలో జరుగనున్న పార్లమెంట్ ఎన్నికల్లో ఖమ్మం బిఆర్ఎస్ ఎంపి అభ్యర్ధి నామా నాగేశ్వర రావు విజయం తధ్యమని, నామ గెలుపే లక్ష్యంగా ప్రతిఒక్క కార్యకర్త పనిచేయాలని ఎంపిపి జల్లిపల్లి శ్రీరామ్మూర్తి పిలుపునిచ్చారు. సోమవారం అశ్వారావుపేట నియోజకవర్గంలోని ఆసుపాక, నందిపాడు, వడ్రంగాపురం, గుమ్మడిపల్లి, బచ్చువారి గూడెం గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బిఆర్ఎస్ ఎంపి అభ్యర్థి నామా నాగేశ్వరరావు గెలుపే లక్ష్యంగా కమిటీలను ఏర్పాటు చేసి ప్రతిఒక కార్యకర్త పనిచేసే విధంగా బూత్ కమిటీ సభ్యులు కృషి చేయాలన్నారు. బిఆర్ఎస్ పార్టీ చేసిన పనులు, ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న పనులను ప్రజల్లోకి తీసుకెళ్లాలని తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం వందరోజుల పాలనలో చేసిన అభివృద్ధి శూన్యమన్నారు. ఇంతవరకు రైతులను పట్టించుకున్న పాపానపోలేదన్నారు. నామా గెలుపుతోనే అన్ని వర్గాల ప్రజల అభ్యున్నతి సాధ్యమవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికార ప్రతినిధి యూస్ ప్రకాశ్, మండల పార్టీ కార్యదర్శి జుజ్జూరపు వెంకన్న, నాయకులు వగ్గేల పూజ, డాక్టర్ ప్రసాద్, రమణారావు, మండల నాయకులు మందపాటి మోహన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## పిడుగుపాటుకు పాడి ఆవు మృతి

ప్రజాపక్షం/లక్ష్మీ దేవిపల్లి: ఆదివారం మండలంలోని గాలి, దుమారం, ఉరుములు, మెరుపులతో కూడిన వర్షానికి గద్ది గుట్ట గ్రామానికి చెందిన బోడ హరిలాల్ అనే రైతుకు చెందిన పాడి ఆవు పిడుగుపాటుకు మృతి చెందింది.

## ఓ ఆర్ ఎస్ తో వడదెబ్బ నుండి ఉపశమనం

ప్రజాపక్షం/కల్లూరు: ఓ ఆర్ ఎస్ తో వడదెబ్బ నుండి ఉపశమనం పొందవచ్చునని వైద్యులు నవ్య కాంత్ తెలిపారు. ఆర్టీసీ బస్సుల్లో ప్రయాణించే ప్రయాణికులకు ఆర్టీసీ సిబ్బందికి వేసవిలో ఓఆర్ఎస్ ద్వారా ఉపశమనాన్ని కలిగిస్తుందని కల్లూరు ప్రభుత్వ వైద్యాధికారి నవ్య కాంత్ అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. కల్లూరు లోని ప్రయాణికుల ప్రాంగణములో ప్రయాణికులకు అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రయాణ సమయంలో ఎండ నుండి ఉపశమనం పొందేందుకు పిల్లలు, వృద్ధులు, గర్భిణీ స్త్రీలు డ్రైవర్లు తప్పనిసరిగా ఓఆర్ఎస్ ద్రావణాన్ని తీసుకొని వెళ్లాలని సూచించారు. ఓ ఆర్ ఎస్ ద్రావణం దగ్గర ఉంచుకొని ప్రయాణం చేయడం ద్వారా డి హైడ్రేషన్ అవకుండా కాపాడుకోవచ్చు అని తెలిపారు. శరీరానికి కావలసిన నీటి లవణాలను తగు మోతాదులో అందించుట ద్వారా వడదెబ్బ నుండి ఉపశమనం పొందవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామీణ బస్సు అధికారి ఆనందరావు, ట్రాఫిక్ గైడ్ వెంకటేష్ , ప్రయాణికులు పాల్గొన్నారు.